


**టూకీగా** కథ చెప్పి రాంబాబు సారధి ముఖం లోకి చూశాడు, ఆయన విమర్శకోసం. ఆ చుట్టు ప్రక్కల సారధికి మంచి పేరుంది— కథా రచయితగా. అందువల్ల రాద్దామని సరదా పడేవాళ్ళు అతని చుట్టు చేరుతుంటారు. అటువంటి వారిలో రాంబాబూ ఒకడు.

సారధి కాసేపు ఏమీ మాట్లాడలేదు. ఆ కాసేపు కాసిని యుగాల లాగా అనిపించింది రాంబాబుకి. పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూసే కుర్రాడి పరిస్థితిలా ఉంది అతని మనఃస్థితి.

చివరికి యోగ నిద్రలోంచి లేచిన మునీశ్వరుడి లాగా తలెత్తాడు సారధి. చిరునవ్వు నవ్వాడు. "మంచి సంఘటనే చెప్పావోయ్, రాంబాబూ!" అని మళ్ళీ కాసేపాగి—"బాగుంది" అన్నాడు.

రాంబాబుకి ఏనుగెక్కినట్లు అయింది. ఫస్టు క్లాసులో పాసయినంత ఆనందం కలిగింది. "థాంక్స్, గురువుగారూ!" అన్నాడు. అతని గొంతు పూడిపోయింది సంతోషంతో.

సారధి సిగరెట్టు నుసి దులిపి—"అయితే రెండు విషయాలు ఉన్నాయి ఇక్కడ. ఏమీ అనుకోకు... కొంచెం నిర్మొహమాటంగా మాట్లాడతాను" అన్నాడు.

"భలేవారే, అనుకోవడ మెందుకండి? చెప్పండి" అన్నాడు రాంబాబు.

"కథలో విషయం బాగానే ఉంది. కాని, చెప్పడం కుదరలేదు. అంటే కథ చెప్పిన తీరు బాగుండలే దన్నమాట. ఇంక రెండవ పాయింట్ నువ్వు చెప్పిన సంఘటన, వూరికే చెప్పుకునేందుకు సరిపోతుంది కాని, కథగా రాసేందుకు సరిపోదు."

"అవునండి" అన్నాడు రాంబాబు, ఇంకేమనాలో తెలియక. అయితే, మనసులో మాత్రం మిన్న బుచ్చు కున్నాడు. ఏనుగు తొండంతో తనని చుట్టకుని విసిరి అవతల పారేసి నట్లయిం దతనికి. అందువల్లనంటే అతనికి కథ రాయాలన్న కోరిక చాలా కాలంగా ఉంది. "యుద్ధంలోకి వెళ్ళేవాడు తగిన మందు గుండు సామాను సిద్ధ పరచుకోనిదే రణరంగంలో అడుగు పెట్టరాదు" అన్న సారధి మాటలు అతనికి బాగా నచ్చాయి. అందువలన సరయిన ఇతివృత్తం తయారు చేసుకుని మరీ ఇందులో అడుగు బెట్టాలని నిశ్చయించు కున్నాడు. అందుకోసం కృషి చేశాడు.

చివరికి ఇప్పటికి తన కృషి ఫలించిందని నమ్మకం కలిగిం దతనికి. వచ్చిన కథని ముందు రాసు కున్నాడు. దిద్దుకున్నాడు. మళ్ళీ తిరగ రాశాడు. ఒకటికి రెండు సార్లు చదివి చూసుకున్నాడు. అన్ని విధాలా బాగుందని అనుకున్నాకనే సారధికి చెప్పాడు. అతను ఆశించినది— కథ వింటూనే

"చాలా బాగుంది. రాసేయవోయ్ రాంబాబూ" అని సారథి అంటాడని అప్పుడు ఇంట్లో రాసి అట్టే పెట్టిన కథని తెచ్చి ఆయనకి చూపిద్దామని!

కనకనే సారథి మాటలు అతనికి చాలా నిరుత్సాహం కలిగించాయి. అయితే, అది బయట పడనివ్వలే దతను.

కాసేపటికి మళ్ళీ సారథే మొదలెట్టాడు. "మంచి కథకుడికి కావలసిన లక్షణం పరిశీలన. ఏ రచయితా కేవలం వూహాల్ని కథలుగా రాయలేదు రాంబాబు. ఎక్కడోక్కడ చూసిన సంఘటన, విన్న వార్త అతన్ని ఉత్తేజితుడిని చేస్తుంది. అప్పుడు ఆ సంఘటనకు తన వూహాశక్తిని కలిపి కథగా అల్లుతాడు. అంటే ఏమిటన్నమాట రచయితకి ముఖ్యంగా కావలసినది పరిశీలన. మామూలు మనిషి మర్చిపోయిన దాన్ని రచయిత గుర్తుంచు కుంటాడు. అది ఎప్పుడో ఒకప్పుడు అతనికి ఉపయోగపడుతుంది. దానికి నగిషీ చేస్తాడు.

ఆ పరిశీలన నీకుంది. అది చాలు— ముందు ముందు నువ్వు కథకుడిగా తయారయేందుకు. ఇప్పుడు నువ్వు చెప్పిన ఇతివృత్తం ఉంది చూశావూ అది నీ పరిశీలనా శక్తికి ఉదాహరణ. అయితే చెప్పాను గదా మొదలే— కేవలం ఈ కాస్త సరిపోదు కథ రాసేందుకు" అని నవ్వాడు.

రాంబాబు కూడా నవ్వాడు ఏం చేయాలో తెలియక.

ఈ సంభాషణ జరిగిన సుమారు రెండు నెలలకి ఒక ప్రత్యేక సంచికలో సారథి రాసిన కథ చదివిన రాంబాబు తెల్లబోయాడు. తను చెప్పిన కథ ఆధారంగా అల్లబడిన కదే అది! అతనికి తన సర్వస్వం ఎవరో దోచి నట్లు అనిపించింది.

పోనీ కథ కింద ఎక్కడున్నా "ఫలానా రాంబాబుకి కృతజ్ఞతలు" అని ఉంటుందేమోనని వెతికాడు. ఎక్కడా అటువంటిది లేక పోవడంతో అతని గుండె బరువెక్కి నట్లయింది.

సాయంత్రం మామూలుగా సారథి దగ్గరకు వెళ్ళాడు. చుట్టూ ఉన్న శిష్యులు సారథిని పొగుడు తున్నారు. ప్రత్యేక సంచికలోని కథ చాలా బాగుందంటూ. అతి సాధారణంగా జరిగే అటువంటి సంఘటనను గమనించి, దానిని అంత చక్కటి కథ రాయడ మన్నది చాలా గొప్ప విశేషమని మెచ్చుకుంటున్నారు. ఆయనకు గల పరిశీలనా శక్తి ఎందరికి ఉంటుంది అని ఒకరి నొకరు ప్రశ్నించు కుంటున్నారు.

రాంబాబుకి వంటిమీద తేళ్ళు పాకు తున్నట్లుగా ఉంది. అది వాళ్ళు సారథిని పొగుడు తున్నందుకు కాదు. అతను చిరునవ్వు నవ్వుతూ వింటున్నందుకు. రెండు మూడు సార్లు ఆ కథ తనదేనని చెప్పేద్దామని ఉద్రేక పడ్డాడు కూడా. కాని, ఎందుకో అతనికి గొంతు పెగల్లేదు.

చివరికి అందరూ వెళ్ళేదాకా ఆగి, తామిద్దరే ఉన్నప్పుడు అడిగారు, "అదేమిటి సార్! నేను చెప్పిన కథ రాసేశారు" అని.

సారథి సిగరెటు దమ్ములాగి చిరునవ్వు నవ్వాడు. "అడుగుతావనేఅనుకుంటున్నాను. ఇంతసేపు ఆగావేం?

> **మిత్రభేదం**
> ఒక మంచి స్నేహితుడు పోవడమంటే మన శరీరంలో ఒక ముఖ్యాంగం లోపించడమే. కొంత కాలానికి బాధ తగ్గవచ్చు గానీ, అవయవ లోపం లోపమే గదా!
> —సాటే

అనడిగాడు.

"వాళ్ళముందు అడగటం ఇష్టం లేకపోయింది"

"తప్పేముంది! ప్రతి కథకి మూలం ఒక మనిషో, ఒక సంఘటనో ఉండి తీరుతుందని ఇది వరకే చెప్పాను... గుర్తుందా? ఏమీ లేకుండా రాస్తే అది కృతకంగా తేలిపోతూనే ఉంటుంది. పైగా నువ్వు చెప్పిన కథ బాగుందని ఆ రోజునే చెప్పాను గదా!"

"చెప్పారు. కాని, కథకి సరిపోదన్నారు కదా! అందుకని మరింకేదయినా దానికి కలపగలనేమో నని ఆలోచించు కుంటున్నాను."

నవ్వాడు సారథి. "కలపలేక పోతున్నావు కదూ? నాకు తెలుసు. అయితే, చేయి తిరిగిన రచయితకి ఆ కాస్త చాలునోయ్. అందుకే రాసేశాను. బాగుంది కదూ?"

గొంతులోంచి పెగలకుండా బాధిస్తున్న మాటలు అనేశాడు రాంబాబు చివరికి, "అయినా, నేను చెప్పిన కథని మీరు. . "

మధ్యలోనే అందు కున్నాడు సారథి—"రాసు కోవడం బాగాలేదంటావు. అలా అనుకోకు మరెప్పుడూను. తప్పు! నేనే కాదు, కథలు రాసేవాడెవడితో నువ్వు స్నేహం చేసినా ఇంతే. రాసుకునే వాడికి చుట్టూ ఉన్న వాళ్లే ముడి పదార్థాలు, రాంబాబూ! నాకు ఫలానా రచయిత బాగా తెలుసును" అని చెప్పుకోవాలంటే దాని వెంటే ఇటువంటి ప్రమాదమూ ఉంటుంది. రాసే వాళ్ళతో స్నేహమే అంత! గులాబికి ముళ్ళుండడం వగైరా సామెతలు తెలుసు కదా! ఇటువంటి ఇబ్బంది ఉండి తీరుతుంది. కాని, స్నేహం కావాలీ అంటే ఈ రిస్కూ తీసుకోవాలి" తప్పదు అని నవ్వి—"బిస్పోర్టివ్ రాంబాబూ! పద కాఫీ తాగుదాం" అన్నాడు.

రాంబాబుకి ఆయన సమాధానం చాలా బాధ కలిగించింది. "చాలా థాంక్స్, రాంబాబూ! నీ పుణ్యమా అని మంచి కథ తయారయింది. సరిగా వాళ్ళు కథ అడిగారు. వాడేసుకున్నాను నీ కథని" అంటా డాయన అనుకున్న రాంబాబుకి చాలా నిరాశ కలిగింది.

అక్కడికీ మనసులోని బాధ ఆగక తమతో తిరిగే ఒకరిద్దరికి చెప్పాడు—"సారథి గారికి కథ చెబితే అది కాస్త ఆయన రాసేసు కున్నాడు" అని.

వాళ్ళు నవ్వేశారు. సుబ్బారావంటే—"మంచి పని చేశాడు. ఆయన చేతిలో పడడం వల్ల అది మంచి కథ అయింది. నువ్వలా రాయగలిగే వాడవా? ముత్యపు చిప్పలో పడితేనే స్వాతివాన ముత్యమవు తుందోయ్, భయ్యా!"

రాంబాబు ఇంక ఎవరికీ ఆ విషయం చెప్పడం మానేశాడు. అయితే, అతని మనసులోని గాయం మాత్రం మానలేదు. సారథితో తిరగడమూ మానలేదు. కొన్నాళ్ళు పోయాక మళ్ళీ అతనికి ఇంకొక కథ చెప్పాడు కూడా.

అతను చెప్పిన కథంతా విని, "చాలా బాగా వచ్చిందోయ్ కథ. నువ్వు రాసేయ్—ఇప్పుడు చెప్పి నట్లు రాస్తే చాలు" అన్నాడు సారథి.

నవ్వాడు రాంబాబు. "నా కెందుకు, సార్! సంవత్సరం పడుతుంది రాయాలంటే. పైగా కుదరదు కూడా సరిగా! మీరు రాస్తే రాణిస్తుంది. రాసేయండి. నాకెందుకండీ, బాబూ" అన్నాడు వేదాంతిలా.

"థాంక్స్!" అన్నాడీ సారి సారథి.

రెండు నెలలకి సారథి రాసిన ఆ కథ పడింది. పడిన వారం పది రోజులకల్లా ఆ పత్రిక వారి నుంచి తనకి వచ్చిన ఉత్తరంచూసి మతిపోయింది సారథికి. అది పుచ్చుకుని పరుగు లెత్తు కుంటూ రాంబాబు రూంకి వెళ్ళా డాయన. వెడుతూనే— "ఎంతపని చేశావోయ్, రాంబాబూ, నీ మాట నమ్మి నువ్వు చెప్పిన కథ రాసుకున్నాను. ఇప్పుడ చూ డీ ఉత్తరం" అని ఉత్తరం ఇచ్చాడు.

చదివాడు రాంబాబు. దాని సారాంశం. "మీ ఫలానా కథ ఫలానా వారు రాసిన ఫలానా కథని పోలి ఉన్నదని మా పాఠకులు తెలియ జేస్తున్నారు. మీ వంటి వా రిటువంటి పని చేశారంటే మాకూ నమ్మశక్యం కాకుండా ఉంది. ఇందుకు మీ సమాధానం కోసం ఎదురు చూస్తున్నాం" అని.

రాంబాబు ఉత్తరం మడతపెట్టి విలాసంగా నవ్వాడు.

"నవ్వుతావేం?" అడిగాడు సారథి కోపంగా.

మళ్ళీ నవ్వాడు రాంబాబు, "గులాబికి ముళ్ళు వగైరా సామెత తెలుసుగదా మీకు, గురువుగారూ! అంతే సింపుల్. చుట్టూ ఉన్న వారు చెప్పే సంఘటనల్లో అటువంటి ముళ్ళు ఉండవచ్చు. ఆ పత్రిక వాళ్ళు రాసినది నిజమే! నేను మీకు చెప్పినది ఆ ఫలానా వారికథే! లైబ్రరీలో చదివాను. నాకు బాగుండడం వల్లనే చెప్పాను" అని మళ్ళీ నవ్వి "ట్రేడ్ రిస్క్ ఎప్పుడూ ఉంటుంది. మాస్టారూ, తప్పదు మరి" అన్నాడు.

మారు మాట్లాడకుండా వెళ్ళి పోయిన తనని చూసి నవ్వుకుని—"ఆ పత్రిక వాళ్ళకి ఈ కథని గురించి ఉత్తరం రాసిందీ నేనేనని పాపం ఈయనకి తెలియదు" అని రాంబాబు అనుకున్న విషయం సారథికి తెలియదు. ★

—సింగరాజు రామచంద్రమూర్తి